గత 20 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ

సంస్కరణల యుగంలో ముఖ్యంగా 1990లలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో వృద్ధిరేటు మందగించినప్పటికీ 2000-01 తర్వాత కాలంలో వివిధ విధాన నిర్ణయాల కారణంగా స్థూల దేశీయోత్పత్తిలో ప్రపంచంలో పదో అతిపెద్ద దేశంగానూ, కొనుగోలు శక్తి ఆధారంగా 14వ అతిపెద్ద దేశంగానూ భారత్ అవతరించింది. ప్రస్తుత ధరల జీడీపీ ఆధారంగా భారత్ 2020 నాటికి ఫ్రాన్స్, ఇటలీని, 2025 నాటికి జర్మనీ, రష్యా, ఇంగ్లండ్‌ను, 2035 నాటికి జపాన్‌ను అధిగమించగల దని గోల్డ్‌మన్ శాచ్ నివేదిక తెలిపింది.

1970ల చివరి భాగంలో పారిశ్రామిక సంస్థల అదనపు సామర్థ్య విస్తరణపై ఉన్న నియంత్రణలు, ధరలపై నియంత్రణలు తొలగించ డంతోపాటు కార్పొరేషన్ పన్నురేటు తగ్గించడం, చిన్నతరహా పరిశ్ర మలకు ప్రోత్సాహం లాంటి చర్యలను మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం చేపట్టింది. తదుపరి కాలంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ విధా నాలు ద్రవ్య లోటు, కరెంట్ అకౌంట్ లోటులో పెరుగుదలకు దారితీసి ఆర్థిక వృద్ధి క్షీణించడానికి కారణమయ్యాయి. భారత్‌తో అతిపెద్ద వ్యాపార భాగస్వామి అయిన సోవియట్ యూనియన్ పతనం, గల్ఫ్ యుద్ధం వల్ల అంతర్జాతీయ చమురు ధరలు పెరగడం వల్ల చెల్లింపుల శేషంలో లోటు పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి 1.8 బిలియన్ డాలర్ల బెయిలవుట్ రుణాన్ని కోరింది. ఈ స్థితి దేశంలో వివిధ రంగాల్లో సంస్కరణలు ప్రవేశపెట్ట డానికి కారణమయింది.

1991 తర్వాత సంస్కరణల యుగంలో భారత ఆర్థిక వ్యవస్థలో పరిమాణాత్మక మార్పులతోపాటు అనేక గుణాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు భాగస్వామ్యం పెంపు, వాణిజ్య సరళీకరణ, స్వదేశీ, విదేశీ పెట్టుబడులపై ఆంక్షల తొలగింపు, విత్తరంగం, పన్నుల వ్యవస్థలో సంస్కరణలు లాంటి చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఈ చర్యల ద్వారా భారత్ ఆర్థిక వ్యవస్థ తన పోటీతత్వాన్ని పెంచుకోగలిగి వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యవ స్థగా రూపాంతరం చెందింది.

వివిధ సూచికల ప్రశ్నలు:

- ఉత్పత్తి కారకాల పంపిణీ దృష్ట్యా నికర జాతీయోత్పత్తి వృద్ధి 1991-92లో (1993-94 ధరల వద్ద) 0.5 శాతం కాగా 2003-04 నాటికి (1999-2000 ధరల వద్ద) 8.8 శాతానికి, 2010-11లో (2004-05 ధరల వద్ద) 8.2 శాతానికి పెరిగింది.
- సంస్కరణల యుగంలో ద్రవ్య సప్లైలో గణనీయమైన పెరుగుదల సంభవించింది. సంకుచిత ద్రవ్యం (ఎం1) 1991-92లో ₹ 1,14,406 కోట్ల నుంచి 2009-10లో ₹ 14,94,611 కోట్లకు పెరి గింది. విశాల ద్రవ్యం (ఎం3) 1991-92లో ₹ 3, 17,049 కోట్ల నుంచి 2009-10లో ₹ 55,99,762 కోట్లకు పెరిగింది.



- భారత్‌లో సంస్కరణల కాలంలో వృద్ధిరేటు పెరుగుదలతోపాటు ద్రవ్యోల్బణం స్థితి కన్పించింది. 1991-96 మధ్య కాలంలో టోకు ధరల సూచీ సగటు సాంవత్సరిక వృద్ధి 10.6 శాతం కాగా, 1996-2001 మధ్య 5.1 శాతానికి తగ్గింది. 2009లో సగటు 7.8 శాతంగా నిలిచింది.
- 8వ ప్రణాళిక కాలంలో (1992-97) వ్యవసాయ రంగంలో 4.7 శాతం వృద్ధి సంభవించగా, 9వ ప్రణాళిక (1997-2002) వృద్ధి 2.1 శాతానికి తగ్గింది. 2010-11లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వృద్ధి 5.4 శాతానికి చేరుకుంది.
- 1992-93లో పారిశ్రామిక రంగంలో 2.3 శాతం వృద్ధి సాధించగా, 2010-11లో 8.1 శాతం వృద్ధి జరిగింది.
- తలసరి ఆదాయం 1990-91లో ₹ 7321 కాగా 2009-10లో (2004-05 ధరల వద్ద) ₹ 33,731.

వ్యవసాయ రంగం:

సంస్కరణల ముందు కాలంతో పోలిస్తే సంస్కరణల తర్వాత కాలంలో వ్యవసాయరంగంలో వృద్ధిరేటు తగ్గింది. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు పారిశ్రామిక, వాణిజ్య రంగాలలోనే కేంద్రీకృతమై వ్యవ సాయ రంగం నిర్లక్ష్యానికి గురైంది. 1990ల రెండో అర్ధభాగంలో వ్యవ సాయ రంగంలో సంక్షోభం ఏర్పడటానికి వ్యవసాయ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టలేకపోవడం కారణమైంది. మరోవైపు పారి శ్రామిక రంగం విషయంలో ప్రభుత్వం తన రక్షణ విధానాన్ని ఉపసం హరించుకోవడం, వినిమయరేటులో తగ్గుదలలాంటి విధానాల వల్ల వ్యవసాయ ఉత్పత్తులకు సాపేక్ష ధరలు అనుకూలంగా ఉండి వ్యవ సాయ ఎగుమతులు పెరగడానికి దోహదపడింది. గత పదేళ్ల కాలంలో వ్యవసాయ ధరల సూచీ తయారీ ఉత్పత్తుల సూచీతో పోల్చినపుడు 30 శాతం పెరిగింది. దీనితోపాటు ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ వాటా పెరిగింది.

వాణిజ్య విధానంలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయ రంగంలో కొంత ప్రగతి సాధించినప్పటికీ వ్యవసాయాభివృద్ధికి ముఖ్య రంగా లైన నీటిపారుదల, డ్రైనేజ్, గ్రామీణ రోడ్లు, నీటి యాజమాన్య పద్ధతు లులాంటి అంశాలపై ప్రభుత్వరంగ పెట్టుబడులు తగ్గడానికి రాష్ట్ర

ప్రభుత్వాల విత్త స్థితి క్షీణించడం కారణమైంది. ఎరువుల సబ్సిడీ, విద్యుత్ ఛార్జీల తగ్గింపులాంటి విధానాల వల్ల ఎరువుల ఉత్పత్తిదారులు, ధనిక రైతులు అధిక లబ్ధి పొందుతున్నారు. ఆహారధాన్యాల ఉత్పత్తి పెంపునకు అవలంబించే ముఖ్యమైన విధానాలు ప్రస్తుతం వ్యవసాయ రంగంలో పంటల మార్పిడికి ఏవిధమైన చేయూతని వ్వడం లేదు. ఇటీవల కాలంలో అధిక మద్దతు ధరల విధానం వల్ల అధిక ఉత్పత్తి పెరిగి తద్వారా ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరిగింది. 1950-51లో స్థూల దేశీయోత్పత్తిలో 55.4 శాతం వాటాను వ్యవసాయ రంగం కలిగిఉండగా 2009-10లో ఈ వాటా 14.6 శాతానికి తగ్గింది. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల వృద్ధిలో తేడా 1981-82 తర్వాత పెరగడం ప్రారంభమై, 1996-97 తర్వాత ఈ తేడా ఇంకా ఎక్కువగా ఉండటానికి, పారిశ్రామిక, సేవారంగాల్లో అభివృద్ధి రేటు పెరుగుదలకు కారణమైంది. వ్యవసాయరంగ ప్రగతిలో భారత్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ప్రపంచంలో పాలు, పప్పు ధాన్యాలు, జౌళి ఉత్పత్తిలో ప్రథమ స్థానాన్ని పొందింది. 2008లో 175 మిలియన్ల పశుసంపదతో అతిపెద్ద పశుసంపద కలిగిన దేశంగా భారత్ అవతరించడంతోపాటు బియ్యం, గోధుమ, చక్కెర, పత్తి, వేరుశనగ ఉత్పత్తిలో రెండో స్థానాన్ని పొందింది. ప్రపంచంలో పండ్ల ఉత్పత్తిలో భారత్ వాటా 10.9 శాతం కాగా, కూరగాయల ఉత్పత్తిలో 8.6 శాతం వాటాను భారత్ కలిగిఉంది. సిల్క్ ఉత్పత్తి, వినియోగంలో ప్రపంచంలో భారత్ రెండో అతిపెద్ద దేశం.

అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధి:

1991 తర్వాత భారత్‌లో ముఖ్య మౌలిక రంగాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించినందువల్ల ఆయా రంగాల్లో వృద్ధిరేటు పెరిగింది. ప్రస్తుత ప్రపంచీకరణ పరిస్థితుల్లో అధిక వృద్ధిరేటు విద్యుచ్ఛక్తి, రోడ్లు, రైలు సౌకర్యాలు, టెలి కమ్యూనికేషన్స్, విమాన సౌకర్యాలు, మంచి ఓడరేవులులాంటి సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది. ఈ రంగాల్లో తూర్పు, ఆగ్నేయా ఆసియా దేశాల కంటే భారత్ వెనుకబడి ఉంది. భారత్‌లో ఈ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులతోపాటు విదేశీ పెట్టుబడులను అనుమతించారు. ప్రైవేటు పెట్టుబడిదారులు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను రాష్ట్రాల విద్యుచ్ఛక్తి బోర్డులు కొనుగోలు చేస్తాయని భావించినప్పటికీ ఆయా బోర్డులు ఆర్థికంగా బలహీనంగా ఉన్నందువల్ల సంస్కరణలు ప్రారంభమైన మొదటి కాలంలో అదనపు విద్యుత్ ఉత్పాదన లక్ష్యంలో సగాన్ని మాత్రమే సాధించడం జరిగింది. 2010 నాటికి విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 1,64,835 మెగావాట్లు కాగా, దీనిలో థర్మల్ విద్యుత్ వాటా 64.6 శాతం, హైడ్రో ఎలక్ట్రిసిటీ వాటా 24.7 శాతం, ఇతర రెన్యువబుల్ ఎనర్జీ 7.7 శాతం, అణు విద్యుత్ వాటా 2.9 శాతంగా ఉంది. గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా నవంబర్ 2010 వరకు 4.19 లక్షల కి.మీల రోడ్ల సౌకర్యం కల్పించారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధి కార్యక్రమం కింద భారత ప్రభుత్వం 180 మిలియన్ డాలర్ల రుణాన్ని ఏసియన్ అభివృద్ధి బ్యాంకు ద్వారా పొందింది. 1951లో భారత్ నౌకాశ్రయాల సరుకు రవాణా సామర్థ్యం 20 మిలియన్ టన్నులు కాగా, 2008 నాటికి 532 మిలియన్ టన్నులకు పెరిగింది. అమెరికా సంక్షోభం కారణంగా కొంతమేర నష్టపోయిన పౌర విమానయాన రంగం 19 శాతం వృద్ధి సాధించింది. 2020 నాటికి ప్రపంచంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్‌గా రూపొందగలదని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. టెలి కమ్యూనికేషన్ రంగంలో 74 శాతం వరకు ప్రైవేటు రంగ పెట్టుబడులు అనుమతించిన కారణంగా ఈ రంగంలోనూ అధిక ప్రగతి సంస్కరణల కాలంలో కన్పించింది.

విదేశీ వాణిజ్యం:

సరళీకరణ విధానాల నేపథ్యంలో 1991 తర్వాత భారత్ విదేశీ వాణిజ్య విలువలో పెరుగుదల సంభవించింది. ఇంజనీరింగ్ వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, వ్యవసాయ ఉత్పత్తులు, ఇనుప ధాతువు, ఇతర ఖనిజాలు భారత ప్రధాన ఎగుమతులుగా నిలిచాయి. 2010-11లో 245.8 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులు జరగగా వాణిజ్యలోటు 104.827 బిలియన్ డాలర్లకు చేరుకుంది. చమురు నిల్వలు దేశంలో డిమాండ్‌కు సరిపోయినంతగా లేకపోవడం వల్ల దిగుమతులు పెరిగి వాణిజ్యలోటు పెరుగుతుంది. చమురు సంబంధిత ఉత్పత్తులు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం, వెండి భారతదేశ ప్రధాన దిగుమతులు.

భారత్‌లో ఉన్న చమురు నిల్వలు 25 శాతం స్వదేశీ డిమాండ్‌ను మాత్రమే తీర్చగలవు. 2009 నాటికి భారత్ ఆయిల్ నిల్వలు 775 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా, గ్యాస్ నిల్వలు 1074 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉన్నాయి. ప్రపంచంలో చమురు వినియోగంలో భారత్ 4వ అతిపెద్ద దేశంగా ఉంది. స్వాతంత్ర్యానంతరం కరెంట్ అకౌంట్‌లో చెల్లింపుల శేషం రుణాత్మకంగా ఉంది. పెరుగుతున్న చమురు దిగుమతులు కరెంట్ అకౌంట్ లోటు పెరగడానికి కారణమయ్యాయి.

సాంఘిక రంగ అభివృద్ధి:

సంస్కరణల యుగంలో విద్య, ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడ్డాయి. 1991లో భారత్‌లో వయోజన అక్షరాస్యత రేటు 52 శాతం కాగా, 2011 నాటికి మొత్తం అక్షరాస్యత రేటు 74.04 శాతానికి పెరిగింది. సాంఘిక సేవలు, గ్రామీణాభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వ్యయం మొత్తం వ్యయంలో 1990-91లో 7.6 శాతం కాగా, ప్రస్తుతం 10 శాతానికి పైగా పెరిగింది. సాంఘికరంగ అభివృద్ధికి తీసుకున్న చర్యల వల్ల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడ్డాయి. 2009 నాటికి ప్రతి వేయి జనాభాకు జననాల రేటు 22.5 కాగా, మరణాల రేటు 7.3గా ఉండటాన్ని బట్టి ఆరోగ్య ప్రమాణాల మెరుగుదలను తెలుసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి వివిధ సాంఘిక సేవలు అందించడంలో సమస్యలు ఏర్పడటానికి సరిపోయినంత వనరులు

లభ్యం కాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌రీ వ్యయంలో 80 శాతానికి పైగా రెవెన్యూ వ్యయం ఉండటం కారణమైంది.

ముఖ్యాంశాలు

- స్థూల దేశీయోత్పత్తిలో ప్రపంచంలో పదో అతిపెద్ద దేశంగానూ, కొనుగోలు శక్తి ఆధారంగా 14వ అతిపెద్ద దేశంగానూ భారత్ అవతరించింది.
- ప్రపంచంలో పాలు, పప్పు ధాన్యాలు, జౌళి ఉత్పత్తిలో ప్రథమ స్థానాన్ని పొందింది.
- 2008లో 175 మిలియన్ల పశుసంపదతో అతిపెద్ద పశుసంపద కలిగిన దేశంగా భారత్ అవతరించింది.
- బియ్యం, గోధుమ, చక్కెర, ప్రత్తి, వేరుశనగ ఉత్పత్తిలో రెండో స్థానాన్ని పొందింది.
- సిల్క్ ఉత్పత్తి, వినియోగంలో ప్రపంచంలో భారత్ రెండో అతిపెద్ద దేశం.
- గ్రామీణ రోడ్ల అభివృద్ధి కార్యక్రమం కింద భారత ప్రభుత్వం 180 మిలియన్ డాలర్ల రుణాన్ని ఏసియన్ అభివృద్ధి బ్యాంకు ద్వారా పొందింది.